# బ్లాక్ మార్కెట్

శర్మ అమిత బిడియస్తుడు. ఉన్నఊళ్లోనే ఫస్టుగ్రేడు కాలేజి ఉంది గనక బియ్యేపాసయినా, అతనెన్నడూ ఇల్లు దాటీ, ఊరుదాటీ బయటికి వచ్చినవాడు కాడు. క్రొత్తమొహాలను సమీపించడమూ, పరిచయం చేసుకోవడమూ అతనికి రానివిద్య. ఇప్పుడు లేదుగాని, చిన్నతనంలో ఎవరైనా తనతో గొంతెత్తి మాట్లాడినా ఏడిచేవాడు. అందుచేత అతనికున్న కొద్దిమంది స్నేహితులూ, ఉపాధ్యాయులూ కూడా అతని విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండేవాళ్లు.

శర్మతండ్రి ఇటీవల చాలాడబ్బు గడించాడు. అసలే కొడుకంటే యెంతో గారాబం. దానికితగ్గట్టు బోలెడంత డబ్బుకూడా వుంది. అబ్బాయి ఇంతకాలానికి ఇల్లువదిలి, లా చదవటానికి పట్నం వెళుతున్నాడంటే తండ్రి బోలెడంత డబ్బు ఇచ్చి పంపాడు. శర్మ కాలేజీలో ప్రవేశించిన రోజునే బాంకులో అయిదువందలు వుంచుకుని, మొదటినెల ఖర్చుకింద రెండువందలు దగ్గిర ఉంచుకున్నాడు.

శర్మదగ్గిర డబ్బున్నట్టు పసిపట్టి అతని సహాధ్యాయులు ఒకరిద్దరు అతనిదగ్గిర చేరారు. పట్నంవచ్చి అతను

సంపాదించిన మొదటి స్నేహితులు వాళ్ళే. శర్మ వెంటనే ఉంటూ, కాఫీహోటళ్ళకూ, సినిమాలకూ తిప్పి దగ్గరఉన్న డబ్బంతా పదిరోజుల్లో ఖర్చు చేయించారు.

పిరికివాడి లక్షణమేమిటంటే, అలవాటులేని పని ఏదీ ధైర్యంగా చెయ్యలేడు. శర్మ రోజుకు ఇరవై రూపాయల చొప్పున ఎన్నడూ ఖర్చుపెట్టి ఎరగడు. నెలకు రెండువందలు ఖర్చుపెట్టినా జాస్తిఖర్చే. అయినప్పటికీ ఆ ప్రకారం డబ్బు పంపిస్తూ వుంటానని తండ్రి అన్నాడు. బాంకులో అయిదు వందలున్నమాటకూడా నిజమే. కాని అది అవసరానికి— రోజువారీ ఖర్చుకు కాదు. ఈ ప్రకారం ఖర్చుచేస్తూ పోతే పైనెల డబ్బు వచ్చేలోపుగా బాంకులో ఉన్నదంతా ఊడ్చిపెట్టుకుపోతుంది. ఏం చెయ్యాలో శర్మకు తోచలేదు. తన స్నేహితుల్ని వదిలించుకుంటే తనకీ బెడద వదులుతుందని శర్మకు తట్టకపోలేదు. కాని యెట్లా వదిలించుకోవటం ?

గత్యంతరంలేక శర్మ బాంకులో నుంచి ఒక వంద తీశాడు. మళ్ళీ వారం తిరిగివచ్చేలోపుగా యెగిరిపోయింది. ఇది యింతేననుకున్నాడు శర్మ. ఒక మనిషిని దోచి మరొక మనిషి ఎట్లా తింటాడో అతనికి అర్థంకాలేదు. తన వెంట వచ్చి తనచేత ఖర్చుపెట్టించటానికి వాళ్ళకి సిగ్గు ఎట్లాలేదో అని ఆశ్చర్యపడ్డాడు. వాళ్ళకి తను ఏవిధంగా అచ్చిఉన్నట్టు? ప్రతాపానికన్నా, ఒక్కసారికూడా వాళ్లు హోటలుబిల్లు లివ్వరే! సినిమా టిక్కెట్లు కొనరే ! తనచేత ఇంతడబ్బు ఖర్చుపెట్టిస్తూకూడా "వెధవహోటలు! వెధవ సినిమా!" అని వ్యాఖ్యానం చేస్తారు. లంచి తీసుకుంటే కానిమేరాలో

తీసుకోవాలిట. వాళ్ళంతవాళ్లు నిత్యమూ కానిమేరాకు వెళ్లే టట్టు! తనకు చిలుము వదులుతూనే ఉంది. వాళ్ళను సంతృప్తి లేనేలేదు. వాళ్ళను సంతృప్తి పరచవలిసిన అవసరం తనకేమిటో? ఇంటి అల్లుళ్ళుకూడ యింత అన్యాయంగా ప్రవర్తించరు. అనుకున్నాడు శర్మ. వాళ్లని వదిలించుకోలే నందుకు అతనికి తనమీాద ఎంతో అసహ్యం వేసింది.

యిటువంటి మనస్థితిలో ఉండగా శర్మకు పద్మనాభ శాస్త్రి పరిచయం కలిగింది. అదికూడా చిత్రంగానే జరిగింది. పద్మనాభశాస్త్రిమారుపేరుతో పత్రికలకి కథలూ,వ్యాసాలూ పంపుతూ వుండేవాడు. కథలమాట ఏదైనా పద్యాలు చాలా చురుకుగానూ, రసవంతంగానూ వుండేవి. వాటిల్లో భావ కవిత్వపు మార్ధవమూ, లాలిత్యమూ లేకపోయినా, ఒక విధమైన బరువూ, వేగమూ, తీవ్రతా, గురీ కలిగి ఎంతో సజీవంగా వున్నట్టుండేవి. అందుచేత శర్మ శాస్త్రి కవిత్వం ఏ పత్రికలో కనిపించినా తప్పక చదివేవాడు. కొన్ని పంక్తులు కంఠస్థంకూడా చేశాడు. కాని ఆ కవి తన సహాధ్యాయి అయిన పద్మనాభశాస్త్రినని శర్మ ఎరగడు.

ఒకనాడు లాకాలేజీలో మీాటింగు. ఎవరో ప్రఖ్యాత కవులు వచ్చి వుపన్యసిస్తారు. శర్మ పెందలాడే వెళ్ళి గాలరీలో కూర్చున్నాడు. అతని పక్కనే పద్మనాభశాస్త్రి, అతనితో తిరిగే ఒక రిద్దరు స్నేహితులూ కూచున్నారు. శర్మ ఎవరినీ అంటించుకునే బాపతుకాదు. గనక వాళ్ళను

పలకరించలేదు. కాని వాళ్ళు మాట్లాడుకునే మాటలు వింటూనే వున్నాడు. పాతకవుల్నీ, వారి పోకడలనూ చాలా తేలికగా విమర్శిస్తున్నారువాళ్ళు. రాయప్రోలూ, దేవులపల్లీ, నాయనీ, వేదులా మొదలైన వాళ్ళలో వేడి ఏనాడో చల్లారిందన్నాడు ఒకడు. వారిలో వేడి చల్లారిందనటంకన్న, జీవితమే వేడెక్కటంవల్ల వారి వేడి ఇప్పుడు మనకు ఆనటంలేదన్నాడు మరొకడు. పద్మనాభశాస్త్రి మరొక వింత సిద్ధాంతం లేవదీశాడు. ప్రతేక కవుల ప్రతిభను గాని, వాటిని సృష్టించే కవిత్వానికిగాని హెచ్చు విలువ లేదుట, అంతకన్న ఒక వుద్యమానికి, ఒక పోకడకూ ఎక్కువ విలువవుందిట. ఒకేసారి పదిమంది ప్రతిభావంతులైన కవులు దేశంలోవుండి కవిత్వం రాసినా వారి వుమ్మడి సాహిత్యంలో ఒక ఆశయము ఒక ధోరణి లేక తలా ఒకదారీ అయిన దానివల్ల ఏమీ ప్రయోజనంఉండదు. ఒక సాహిత్య వుద్యమం వున్నచోట ఒక గొప్ప కవికూడా లేకపోయినా ఆ ఉద్యమంలో తయారయిన సాహిత్యం సాంఘిక ప్రయోజనం కలిగిందిట. ఈ సాహిత్య సిద్ధాంతం విని ఊరుకోలేక శర్మ, "షేక్స్పియరు ఏ సాహిత్యోద్యమం వాడు? కాళిదాసు మాటేమిటి?" అని పద్మనాభశాస్త్రి నడిగాడు. ఆకాలంలో సంఘం సాహిత్యంమీద ఇంతగా ఆధారపడి వుండలేదు"అన్నాడు శాస్త్రి. "మన పూర్వులు సంఘం ప్రయోజనం చూచి కావ్యాలు వ్రాయలేదా" అన్నాడు శర్మ. "తాటాకు పుస్తకాల కాలంలో ఒక్క ఉద్గ్రంథమే ఒక వుద్యమంగా వుండేద"న్నాడు శాస్త్రి.

అన్నిటికీ అన్నీ చెప్పటానికి శాస్త్రి తయారవుతున్నట్టు కన పడింది శర్మకి. అతను వాదం కట్టిపెట్టేసి, "కాలేజీ విద్యార్థులుసాహితీపరులయ్యేసరికి సాహిత్యం అధోగతికిపోతోంది" అన్నాడు శర్మ. పద్మనాభశాస్త్రి వెంటవున్న యిద్దరు ముగ్గురూ ఒకసారి నవ్వి, "శాస్త్రి మంచిదెబ్బతిన్నాడు... ఏమంటావు, శాస్త్రీ? చెప్పుకో సంజాయిషీ!" అన్నారు. వాళ్ళెందుకు నవ్వారో శర్మకు అర్థంకాలేదు. కాని మరి కాస్సేపట్లోనే శాస్త్రి తన అభిమాన కవి అని శర్మ తెలుసుకున్నాడు. కవిత్వం గురించి గురువల్లే తనకు చెప్పదగిన మనిషితో వాదించినందుకు శర్మకు కష్టంవేసి శాస్త్రికి క్షమాపణయిచ్చి, అతని కవిత్వంమీద తనకున్న అభిమానం బయటపెట్టాడు. "నా విశ్వాసాలమీద అభిమానం వుండి, వాటిని బలపరచటానికి పదిమంది కవులు ముందుకు వస్తే ఏదన్నా ప్రయోజనం వుంటుంది. లేని పక్షంలో నాది అరణ్యరోదనమే," అన్నాడు శాస్త్రి.

ఈవిధంగా శర్మ శాస్త్రిస్నేహితులలో ఒకడైనాడు. యిదివరకు శర్మ తను చదివే పుస్తకాలలో వుండే భావాలకు సాంఘిక ప్రయోజనం వుందనే జ్ఞానం అట్టే లేకుండా వుండేవాడు. రచనలద్వారా రచయితల పరిచయం చేసుకునేవాడేతప్ప ప్రపంచంతో పరిచయం చేసుకునేవాడుకాడు. శాస్త్రికవిత్వంనిండా స్వాతంత్ర్యకాంక్షా, దారిద్ర్యంగురించీ, అజ్ఞానంగురించీ ఆవేదనా, కష్టజీవులనుగురించి బాధా మొదలైనవాటిని శర్మ రససాధనాలుగా పరిగ్రహించేవాడే గాని, అవి యదార్థమైనవనీ, జీవితంలో వాటికి వేరు

వేరు అర్థాలున్నాయనీ ఎన్నడూ బుద్ధితో గ్రహించి వుండలేదు.

శాస్త్రి స్నేహం శర్మకు అనేకవిధాల లాభించింది. నిప్పుసెగ తగలగానే నెయ్యి కరిగినట్టు తన పాతస్నేహితులు విచ్చిపోయినారు. శాస్త్రి వాసనగాని, అతని అనుచరుల వాసనగాని వాళ్ళకి ఏమాత్రమూ సరిపడలేదు. ఆ మాటకు వస్తే శర్మకూడా వాళ్ళ వాతావరణం కొత్తగానే వుండేది. అతనిమాదిరిగా శాస్త్రి లోకాన్ని వున్నదున్నట్టు ఆమోదించినవాడు కాడు. సంఘ వ్యవస్థలో కొన్ని లోపాలున్నాయనీ, సంఘ వ్యవస్థను వివిధంగా మార్పుచేసే శక్తులు కూడా వున్నాయనీ, కొన్ని శక్తులను బలపరిస్తే సంఘం మరింత అధోగతికి పోతుందనీ, ఏమీ చెయ్యకుండా ఆమోదించి ఊరుకున్నవాడుకూడా ఒక తరగతి సంఘద్రోహేననీ శాస్త్రిమతం. శాస్త్రి అనుచరులలో ఈ మతం పుచ్చుకోనివారు లేరు. శర్మకీ దృష్టి వెనక ఎప్పుడూ లేదు. ప్రపంచంలో ఏయే సాంఘిక నియమాలున్నాయో వాటినల్లా పాటించటమే మంచివాడి లక్షణమని అతను నమ్మివున్నాడు. అందుచేత శాస్త్రి ఒకవిధమైన విప్లవకారిగా అతని దృష్టికి తోచాడు. బాంబులు వెయ్యకపోతేనేం? సంఘంలో చలామణీ అవుతున్న అనేక సిద్ధాంతాలనీ, విశ్వాసాలనీ శాస్త్రి ప్రతిఘటిస్తున్నాడు. అందుచేత శర్మకు శాస్త్రిమీద గౌరవంతోపాటు అంతో యింతో భయంకూడా వుండేది.

శాస్త్రి మగవాడు, అతనిలో యిటువంటి ఆవేశం వుండటం అంత వింతకాదు. శాస్త్రి చెల్లెలు వనజాక్షికూడా

యిదే ధోరణి. తను చెప్పినదంతా అవునంటుందేమో నను కున్నాడు శర్మ మొదట్లో. కాని చూసినకొద్దీ వనజాక్షితో పోలిస్తే శాస్త్రి యింకా సౌమ్యుడుగా కనిపించాడు.

వనజాక్షి యింటరు మొదటి సంవత్సరం చదువు తున్నది. కాని, యిప్పటికే అనేక పుస్తకాలు చదివింది. ఎంతో అందంగానే దుస్తులూ అవీ ధరించేది. అయినా మగవాళ్ళ నాకర్షించటానికి ప్రయత్నిస్తున్న మనిషిలాగా కనిపించేదికాదు. ఆడపిల్లలు సహజంగా మాట్లాడే విష యాలను గురించి సంభాషించేదికాదు. ఎప్పుడూ మగవాళ్ళ మధ్యనే వుండటంవల్ల వనజాక్షి అట్లా తయారయి వుండ వచ్చు. అచ్చగా ఆడపిల్లలమధ్య ఒక గంట గడపవలసివస్తే ఆమె ఏంచేస్తుందో శర్మ ఊహించ లేకపోయినాడు.

శర్మకు వనజాక్షిమీద గౌరవంతోపాటు అనురాగం కూడా ఏర్పడసాగింది. మొదట్లో ఈ అనురాగం విస్ప ష్టంగా లేదు. అటువంటి ఆడవాళ్ళు చాలా అరుదనీ, వన జాక్షి ఎవరిని పెళ్ళాడుతుంతోగాని వాడు ఎంతో పెట్టిపుట్టిన వాడయి వుండాలనీ అనుకున్నాడు. బీచికి షికారువెళ్ళినా వెంట వనజాక్షి వుంటే ఒక ప్రత్యేకమైన ఆనందం వుండేది. "నేను వనజాక్షిని ఎరుగుదును," అని అందరితోటీ చెప్పుకోవా లనిపించేది. తన కేదైనా పుస్తకంగాని సినిమా గాని నచ్చితే వెంటనే ఆ అనుభవం వనజాక్షికూడా పంచు కోవాలని ఉబలాట పడేవాడు శర్మ. వనజాక్షి తన అభి రుచిని బలపరచకపోతే చాలా కష్టపడేవాడు. కాని వనజాక్షి విమర్శ శ్రద్ధగా వినేవాడు. వనజాక్షితో చర్చించి తన అభి

రుచులు చాలా విషయాల్లో మార్చుకున్నాడు. కాని అతని కట్లా చెయ్యటంవల్ల ఆత్మవిశ్వాసం తగ్గలేదు. అతని వ్యక్తిత్వానికి భంగంకూడా రాలేదు.

మరో కారణంచేతకూడా వనజాక్షి శర్మకి దగ్గర మనిషి అయింది. శాస్త్రి తన రచనలను గురించి దీర్ఘ చర్చలు ప్రోత్సహించేవాడు కాడు. కాని వనజాక్షి అటువంటి చర్చలు గంటలతరబడి చెయ్యనిచ్చేది. శాస్త్రికున్న అనేక స్నేహితులకన్న శర్మ వనజాక్షికి దగ్గర స్నేహితుడుగా పరిణమించాడు. వనజాక్షి అతనిదగ్గర చనువు చాలా తీసుకునేది, అతనికి చనువు ఇచ్చేదికూడాను. ఎక్కడికైనా బయల్దేరి పోయేటప్పుడు శర్మ ఆఖరుక్షణాన వనజాక్షిని చీరె మార్చుకోమనేవాడు. వనజాక్షి మార్చుకునేది. శర్మకు తనమీద సర్వహక్కులూ వున్నట్టు నటించడం వనజాక్షికి సరదా.

ఆమె తన జీవితంలో—ప్రత్యేకించి తన మానసిక జీవితంలో—ఎంత స్థానం ఆక్రమించుకుందో ఆలోచిస్తే శర్మకు భయం కలగసాగింది. ఎల్లకాలమూ యిట్లా వెళ్ళదు. లా చదువయిపోతుంది. తను స్వగ్రామం వెళ్ళి మళ్ళీ మామూలు జీవితంలో పడిపోతాడు. తనకు పెళ్ళవుతుంది. వనజాక్షికి పెళ్ళవుతుంది. అప్పుడు వనజాక్షి ఆక్రమించుకున్న స్థానం ఖాళీ అయితే తన మనస్సేమైపొయ్యేటట్టు ? ఆ జాగాలో యింకేమీ పెట్టటానికి వుండదు.

సాహసించి మైమరచి, తాను వనజాక్షిని పెళ్ళాడతాననవచ్చును. కాని ఆమె యెందుకు ఒప్పుకుంటుంది ? అసం

భవం! తన తల్లిదండ్రులకుగాని, యితర బంధువులకుగాని అర్థమయ్యే మనిషికాదు వనజాక్షి. వనజాక్షిని పెళ్ళాడటానికిగాని, ఆమెను తన ఇంట్లో కాపరం పెట్టటానికిగాని తన కేవిధమైన హక్కూ లేదు. ఆమెకు తగ్గ భర్తగా తయారై, తనకోసం ఇంటిదగ్గర యెదురుచూసే కుళ్ళు జీవితాన్ని తృణీకరించి తోసివేసే శక్తి అంతకన్నా లేదు. వనజాక్షి తనకి దక్కదు—మున్ముందెటికీ దక్కదు. ఆ విషయంలో శర్మకు యెటువంటి సందేహమూ అవసరంలేదు! అయినప్పుడు, ఈ స్నేహం ఏమయ్యేటట్టు?

ఈ సమస్య శర్మను చాలా బాధిస్తూ వుండేది. వనజాక్షి తనను దూరంగా వుంచితే బాగుండును, అనుకునేవాడతను. కనీసం పద్మనాభశాస్త్రి అయినా తమ స్నేహం పట్ల అనుమానమూ, అసూయా ప్రకటించితే బాగుండును అనుకునేవాడు.

శర్మ సమస్య తలవని తలంపుగా, అకస్మాత్తుగా పరిష్కార మయింది.

ఒకనాడు శాస్త్రి నలుగురు స్నేహితుల యెదటా తాను రాసిన కొత్తగేయం వినిపించాడు. దానిపేరు "చీకటి బజారు" అది విస్పష్టమైన రచనకాదు. ఒకేసారి రెండు మూడు విషయాలు ధ్వనించేటట్టుగా, వ్యంగ్యంగానూ, నిగూఢంగానూ రాశాడు శాస్త్రి. అందులో జారత్వమూ, చోరత్వమూ, దొంగవ్యాపారమూ ఒకేసారి వర్ణించబడ్డాయి. ఒక్కోచోట అన్వయం అస్పష్టంగా వున్నా అంతటా ధ్వని అత్యద్భుతంగా వుంది.

శాస్త్రి చేత ఆ గేయం అరడజనుసార్లయినా చదివించుకున్నారు స్నేహితులు. శర్మకుమాత్రం మొదటినుంచీ కూడా ఆ గేయం తన ఆస్వాదనకు పనికివచ్చేది కాదన్నట్టు అనిపించింది. అన్నిసార్లు విన్నప్పటికీ అది తనలో ఏవిధమైన ఆనందమూ రేకెత్తించలేదు. పైపెచ్చు తనకీ ఆ గేయానికీ మధ్య ఏదో ఒక గోడ అడ్డం వున్నట్టుకూడా కనిపించింది.

గేయం చదవటం అయినాక కంట్రోళ్ళను గురించీ, దొంగమార్కెటుగురించీ, ఆకలి చావులనుగురించీ నలుగురు మాట్లాడసాగారు. ఆ చర్చలో తన కేమీ భాగంలేనట్టుగా కూర్చున్నాడు శర్మ. అతని మౌనం అర్థంచేసుకున్నట్టుగా మిగిలినవాళ్లు తమలోతాము చర్చించుకో సాగేవారేగాని అతన్ని పలకరించలేదు. నలుగురు చేరినచోట ఒకర్ని వొదిలేసి మిగతావాళ్ళు మాట్లాడుకుంటుంటే, సంభాషణలో చేరని మనిషికి యెంతో కష్టంగా వుంటుంది. ఆ మనిషికి దగ్గరవాడైతే మరీ కష్టంగా వుంటుంది. శర్మకు చాలా కష్టం వేసింది. యితరులేంచేసినా అతనికి బాధలేదు. వనజాక్షి కూడా తనను విస్మరించటం అతన్ని మరీ బాధించింది.

దొంగవ్యాపారం చేసేవాళ్ళని అందరికన్నా వుత్సాహంగా తిట్టుతున్న మనిషి వనజాక్షే. మిగిలినవాళ్ళూ తిడుతున్నారు. కాని వాళ్ళేమంటున్నారో శర్మకు పట్టలేదు. వనజాక్షి తిట్టటమే అతనికి వినిపిస్తోంది. ఆమె అయినా దొంగ వ్యాపారస్తుల నుద్దేశ్శి తిడుతున్నట్టులేదు; తననే తిడుతున్నట్టున్నది. తనని సహించటానికే ఈ సంభాషణ యావత్తూ జరుగుతున్నట్టుంది. వనజాక్షే పనిపెట్టుకుని తన

అన్న చేత "చీకటిబజారు" గేయం రాయించిందనికూడా శర్మ అనుమానించాడు.

ఈ క్షణాన వనజాక్షిని చూస్తే శర్మకు హత్యచెయ్య బుద్ధిపుట్టింది. మనం ఇతరులను క్షమించినంత సులభంగా ప్రేమించినవారిని క్షమించలేం. శర్మ వనజాక్షిని క్షమించలేకపోయినాడు. అతను అకస్మాత్తుగా సంభాషణలో జొరబడి, "శ్రీరంగ నీతు లెన్నయినా చెప్పవచ్చు! అవకాశం దొరికితే దొంగమార్కెట్లో డబ్బు చేసుకోనివా ళ్ళెవరూ వుండరు!" అన్నాడు గట్టిగా.

అందరూ ఆశ్చర్యంతో అతనికేసి చూశారు. ఒక నిమిషంపాటు ఎవరినోటా మాటలేదు. ఆ నిశ్శబ్దం అసలే భరించలేకపోయినాడు.

"మా నాన్న వేలకువేలు సంపాదించాడు. నా దగ్గర మీలో ఎవరైనా ఒక చుక్క కాఫీ తాగిఉంటే అది నల్లబజారులోనుంచే వచ్చింది. ఆ పాపం పొయ్యేటందుకు మీరంతా ఏదైనా పుచ్చుకోండి!" అన్నాడు శర్మ హిస్టీరియాతో.

అతని మాటలకు యెవరూ చలించలేదు. కాని వనజాక్షి మొహం జేవురించింది. ఆమె కోపంతో వొణికి పోవటం శర్మ స్పష్టంగా చూడగలిగాడు.

"మీరు తక్షణం వెళ్ళిపొండి! యిక యిక్కడి

కెన్నడూ రావద్దు తెలిసిందా? యెన్నడూ రావద్దు" అని కేక వేసింది.

శర్మ మారు మాట్లాడలేదు. లేచి వెళ్ళిపోయాడు. యెవ్వరూ మాట్లాడలేదు. శాస్త్రి చాలా చిన్న గొంతుతో యిట్లా చెప్పాడు:

"మనం ఏ దొంగ వ్యాపారినిగురించీ మాట్లాడుకోవటంలేదు. దొంగ వ్యాపారంగురించి మాట్లాడుకుంటున్నాం. రేపీ కంట్రోళ్ళు రద్దయితే బహిరంగంగానే ధరలు పెంచి వ్యాపారాలు సాగిస్తారు. శర్మగాని వనజాక్షిగాని వ్యక్తిగతమైన నిందలకు దిగవలసిన అవసరంలేదు." అన్నాడు.

వనజాక్షి సమాధానం చెప్పలేదు. ఆమె శర్మ ప్రవర్తనను ఏమాత్రమూ సహించలేకపోయింది. అతను క్షమాపణ చెప్పుకోకపోతే అతన్ని గురించి తన అభిప్రాయం అణుమాత్రంకూడా మార్చుకోదలచలేదు. అతని తండ్రి ఏపాడుపని చేసినప్పటికీ శర్మ తండ్రిని వెనక వేసుకొనివచ్చి ఉండనవసరం లేదనుకున్నదామె.

శర్మ ఆరోజల్లా తనకు పెద్ద అవమానం జరిగినట్లే భావించాడు. తన తొందరపాటును రకరకాల సమర్ధించుకున్నాడు. కాని ఒకటి రెండు రోజులు గడిచిన తరవాత అతని చెవిలో వనజాక్షి అన్న ఆఖరుమాటలు మారుమోగటం మానేసి అంతకుపూర్వం ఆమె అన్నమాటలన్నీ ధ్వనించసాగాయి. ఆ వనజాక్షి ఏమయిందా అని ఆశ్చర్య

పడ్డాడు. ఆ వ్యక్తి తన కల్పనేనా ? అసలు వనజాక్షి తనను వెళ్ళిపొమ్మన్నదేనా ? అతనికి తెలియలేదు.

డిసెంబరు సెలవులకు శర్మ ఇంటికి వెళ్ళాడు. అతను యింటికి చేరిన మరి రెండు రోజులకు అతని మొదటి స్నేహితు లిద్దరు వచ్చారు. తన స్నేహితులల్లే నటించారు. శర్మ తండ్రినికూడా నమ్మించారు. శర్మకు వాళ్ళనుచూస్తే యెంతో రోతపుట్టింది. కాని అతని తండ్రిమాత్రం వారిని ఆర్తిగా స్వీకరించాడు. వాళ్ళమీద యెంతో డబ్బు ఖర్చు చేశాడు. వారం రోజులుండి వాళ్ళు వెళ్లిపోయినారు

"పట్నంలో నీ కిటువంటి స్నేహితు లున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. చాలా పెద్దమనుషులు!" అన్నాడు తండ్రి.

శాస్త్రినిగాని వనజాక్షినిగాని చూస్తే తన తండ్రి ఏమని ఉండునో అతని కర్థమయింది. తన తండ్రికి కావలసింది డబ్బుకు దొరికే పెద్దమనుషులు! ఆయన అనదగిన మాటలు తను అనేశాడు శాస్త్రి యింటిదగ్గిర. ఇంతకంటె విపరీతం ఉంటుందా ?

శర్మ వెంటనే కూచుని వనజాక్షికి రెండు బంతుల ఉత్తరం రాశాడు.

"వనజాక్షి, మతిలేనివాడి క్షమాపణ కేమైనా అర్థం ఉంటే నా క్షమాపణ స్వీకరించు—శర్మ."

ఈ ఉత్తరానికి వనజాక్షి మరో రెండు బంతుల జవాబిచ్చింది :

"శర్మగారూ, నేను చాలా తెలివిగలదాన్నని చెప్పలేను. కపటం ఉన్నవాళ్ళెవరూ తమ ఉద్రేకాన్ని యీలాగ బయట పెట్టుకోరు. అది గ్రహించలేక పోయినాను—వనజాక్షి."

—♦ సమాప్తం ♦—